# ఇదిగో మాట!

"ఎంతమంచికథేనాసరే యిట్టే కంచికి పంపేస్తావమ్మా నువ్వు!" అంటూ బుంగమూతి పెట్టి మారాం చేసే పాప జ్ఞాపకంవచ్చి కళ్ళు చమర్చాయి. అవును, సుందరస్వప్నంలాగ అల్లిబిల్లిగా అల్లుకుపోతూన్న జీవితాలకథ అంతే కదా అనిపించింది.

కాలం జీవితంలో ఏదో తెలియని మార్పు తెస్తుందని భ్రమపడతాం. చిన్న పిల్లలు బక్కగావుండేవాళ్లు పెద్దయాక దుబ్బుగా అవుతారంటారు. కోతి చేష్టలకి పేరుతెచ్చుకున్న కుర్రకారు ఎంతో నమ్రతతో మసులుతారు పెద్దయితే అంటారు. మొరటుగావుండేవాళ్లు సున్నితులుగా రూపం దిద్దుకొంటారు అంటారు. కాని వాటిలో నిజం ఎంత అన్నది ఎవరూ తేల్చి చెప్పలేరు. కష్టాలు కల కాలం కాపురం వుండవు అంటారు. 'అలాగే సుఖాలూను' అని మటుకు ఎందుకనరు?

ఏవో పిచ్చిఆలోచనలు చేస్తుంది బుర్ర. ఆడపిల్లలకి మెదడు తక్కువా హృదయం ఎక్కువా అనేవాడు పెద్ద మావయ్య. కాని ఆ మామయ్య యీనాడు ఎక్కడున్నాడు! లేడు. హృదయం తక్కువా మెదడు ఎక్కువా యిచ్చాడు కాదేం ఆ దేవుడు? అలాయిస్తే కర్కోటకుల ఎత్తులకి పై ఎత్తులువేసి హాయిగా జీవితంగడిపేయడం తెలుస్తుంది కదా! అది చేతకాకనేకదా యిలా సహం చచ్చిన నల్లుల్లాగా బ్రతకడం. నిజంగా ఆడవాళ్లకే కనక హృదయం తక్కువ వుంటే ... పిచ్చి ఆలోచనలు ... పని లేనప్పుడు యిలాంటి చొప్పదంటు ఆలోచనలు కోకొల్లలుగా వచ్చిపడతాయి.

బాగా వర్షంకురుస్తూంది. యింటి ముందు రేకులవరండా కావడంచేత చప్పుడు విపరీతంగా విన్పిస్తూంది. ఒకసారి పడేది ఒకే వానచినుకైనా ఎన్నో ఒక్కొక్కసారి పడుతూండడంవల్ల అంత చప్పుడు! ఇంత యిల్లు కట్టిన ఆసామీ యీ మాత్రం వరండాకి పెంకు వేయించలేకపోయాడా? ... ఆఁ అయినా అవస

కె. రామలక్ష్మి

దానికి కట్టాడా ఏం యిల్లు, అద్దెకోసం కాని! ... రేకులమీద పడుతున్నవాన చప్పుడుకి ఉరుముల మోత కూడ విన్పించడం లేదు అప్పుడప్పుడు. ఆ చప్పుడు ఎక్కువ అవుతూందేకాని తగ్గడం కన్పించడంలేదు.

గదిలో తెరచిన కిటికీలోంచి వర్షపు జోరుని చూస్తూంది సీత. మబ్బు పట్టడం, అది దట్టమవడం, చిరుగాలి, చిరువాన జల్లు, యీ ధారాపాతంగా కురుస్తూన్న వర్షం...అంతా అలా కిటికీ లోంచి చూస్తునేవుంది. కళ్ళలోంచి కన్నీరు కారి ముఖంమీద చారికలు కట్టింది. అలసిన సీత ముఖం అందంగా వాడిపోయిన పువ్వులాగా వుంది. చూసే వాళ్ళకి ఆ సీత వర్షాన్ని చూస్తోందో, ఏదో దూరతీరాలను పరిశీలిస్తోందో తెలియదు. ఆ చూపులు అంత అంతు తెలియకుండా వున్నాయి. జీవితవసంతం ఎంత త్వరగా రూపుమాసి పోతుంది! అనుకుని పేలవంగా నవ్వుకొంది సీత. నిజమే జీవితవసంతానికి పరిమితి చాలా తక్కువ. దాని సౌరభాలు మాత్రమే జీవితం పొడుగునా మిగులుతాయి. అవి మన అదృష్టం బాగుంటే చక్కని హాయిని నింపుతాయి. లేకుంటే నిస్పృహతో, ఆవేదనతో జీవితాన్ని పెల్లగించివేస్తాయి.

*గతంలో :*

సీత దూసుకుపోయే బాణంలాగా, ఎక్కడా నిలవని పాదరసంలాగా చలాకీగా వుండేది. చదువుకొనేది. కొద్దిగానేం కర్మ! గొప్పగానే చదువుకుంది. అమ్మకీ నాన్నకీ ముద్దులకూతురు. స్నేహితురాళ్ళకి బాహ్యప్రాణం. కుర్రకారుకి కంట్లోనలుసు! ఆమెని ప్రేమించని కుర్రాడులేడు. ఆరాధించని యువకుడులేడు. అయితేనేం? సీత మటుకు నిజంగా ఎక్కొట్టినబాణమే! ఎవరేమంటే ఏం విరుచుకుపడుతుందోఅని అందరికీ భయమే. సీత మితభాషి. అందకత్తె. వూహలపోగు. ఎప్పుడూ దేన్నో అన్వేషిస్తున్నట్టుండేవి ఆమెకండ్లు...ఇంట్లోనే పెట్టుకుని దేనికీ అన్వేషణ అంటూ స్నేహితురాళ్ళు వేళాకోళం చేసేవారు. వాళ్ళ ఉద్దేశం — శేఖరంబావ. శేఖరంబావ కాలేజీలో చదువుకుంటూ సీతయింట్లో వుండేవాడు. సీతకీ శేఖరానికీ ఎలాగా పెళ్ళి అవకతప్పదని వాళ్ళవూహ.

అలాగే జరిగింది. శేఖరం కాలేజీ చదువు ముగించి గుమస్తాగా ఉద్యోగంలో చేరాడు. రెండునెలలు చూసి పెళ్ళి స్థిరపరిచారు. చూస్తూన్నబావేకదా అనుకుంది సీత. దగ్గిర సంబంధం పువ్వుల్లో పెట్టి పూజిస్తాడు అనుకున్నారు సీత తల్లితండ్రులు. సీతకేం...కోరిన భర్త అనుకున్నారు స్నేహితులు.

ఉన్నదాంట్లోనే మేనల్లుడికి అల్లుడి మర్యాదలు జరిపి పెళ్ళిఘనంగా చేశాడు సీత తండ్రి. ఎంత మేనల్లుడే అయినా ఇంతో అంతో అలకలు లేకుండా జరగ

లేదు పెళ్ళి. అయితేనేం — అయిందని పించామన్న తృప్తి అందరికీ కలిగింది. సీతతల్లి అత్తవారింటికి వెళ్ళింది. శేఖరానికి హైదరాబాదులో ఉద్యోగం అవడంతో కొత్తకాపురం ఆ వూళ్ళో పునాది వేసుకుంది.

ఎందరెందరినో ఉవ్విళ్లూరించిన సీత, తనకళ్ళని అసూయతో కప్పించి ఆ రోజుల్లో చలాకీగా తిరిగినసీత యీ నాడు పెళ్ళాం అవడంతో కొండెక్కి కూర్చున్నాడు శేఖరం. అతనిలో సీతపట్ల ఆప్యాయతా ఆదరణా కంటె — గెలిచాం దీన్ని, అన్న ధీమాయే ఎక్కువగా గోచరించింది. తొలివలపుల గుబాళింపులలో అసలు వ్యక్తిత్వాలు గోచరించవు. సీత శేఖరాన్ని ఆరాధించింది. బావే భర్త అవడంతో స్నేహం యింకా సన్నిహితం అయి ఎంతోహాయిగా కాలంగడుస్తుంది అనుకుంది. తొలిరోజులలో అలాగే గడిచింది కూడా.

సాయంత్రం ఎప్పుడవుతుందా! అని సీత ఎదురుచూస్తే — గడియారంమీద కళ్ళువుంచి వూపిరిబిగపట్టి పనిముగించుకు వచ్చేవాడు శేఖరం. ఇద్దరూ హాయిగా తిరిగి ప్రేమపక్షుల్లా విహరిస్తూ వుండేవారు. కాని వ్యక్తికి సౌందర్య పోషణ అందాన్నెలా ఎక్కువచేయదో — యీ కొత్త నురుగుల ప్రేమ మోజూ అంతే. కాలం గడిచినకొద్దీ సీతకి గడప దాటే అవకాశం లేకుండా పోయింది.



డాక్టరు : ఇంతగా బ్లడ్ ప్రెషరు రావడానికి కారణ మేమంటారు?

రోగి : బ్లడ్ ప్రెషరూ వస్తుంది, గుండె ఆగుతుంది మా పక్కింటి దుండగిగాడుచేసే అల్లరికి!

ఎప్పుడూ వీధిపక్కనవున్న కిటికీలో కూర్చుని ఎక్కడికో చూడడమే హాబీగా తయారైంది. దానికితోడు చిన్నపాప. వచ్చీరాని మాటలు; యీ మాటల వెనుక ఎంత ఆప్యాయత కుమ్మరిస్తుందో చిన్నారి పాప! దానికేం తెలుసు, తనుపుట్టి అమ్మా నాన్నా మధ్య అగాధం తెచ్చానని! అందుకే తనే వారికి సర్వస్వం అనుకుని బోసినవ్వులు గుమ్మరిస్తుంది. నక్షత్రాల్లా మెరిసిపోయే కళ్ళల్లో అంతు తెలియని ఆలోచనలు, అల్లిబిల్లి చిలిపిచేష్టలు కనిపిస్తాయి. శేఖరానికి పిల్లలంటే విసుగని సీతకెలా తెలుస్తుంది — సీతని ప్రేమించిన

శేఖరం పాపని గుదిబండలా ఎలా వర్ణిం చాడో — తలుచుకుంటేకూడా ఆశ్చర్యపడి నమ్మకం కల్గేదికాదు సీతకి.

హైదరాబాదునగరంలో ఓ మూల యింటిలో వాసాలు లెక్క పెడుతూ, ఓపిక వున్నప్పుడు, మనస్సు స్థిమితంగా వున్న ప్పుడు పాపకి కథలు చెప్పడం సీతకి హాబీగామారింది. పాప ప్రశ్నలు విసుగు తెచ్చినా-నేనువిసుక్కుంటే ఏమైపోతుంది- అన్న భయంతో పాపని హృదయంలో దాచుకునేది సీత.

ఇక వర్తమానంలో :

సీత చిక్కి శల్యమైంది. శేఖరం కొట్టిన దెబ్బలకి ఆమె పచ్చటి శరీరం కందిపోయి మొద్దు బారిపోయింది. హైదరాబాదు అష్ట యిశ్వర్యాలూ ప్రసాదింపక పోయినా-ఒక్క మహదైశ్వర్యాన్ని అందరికీ అందించి పుణ్యాత్మురాలవుతూంది! ఆఫీసునుంచి అలాగే బార్‌కిపోయి ఏ రాత్రికో యింటికి చేరే మంచిగుణం అలవాటు చేసుకున్నాడు శేఖరం. పెద్దవాళ్ళుంటే — రత్నంలాంటి భార్య నింట్లో పెట్టుకునీ యిదేంపోయే కాలంరా! అని తిట్టి వుందురు. కాని పెళ్ళి అయాక పెద్దవాళ్ళకి యింకే బాధ్యతా యివ్వదు యువతరం! శేఖరం ఇప్పుడు గుంజకు కట్టిన పశువుమాత్రమే. తాడు పొడుగునుబట్టి ఎంతదూరమైనా పోగలుగు తుంది పశువు. కాని ఏదో ఒకసారి వెనక్కి తిరక్క తప్పదు. అలాగే ఇల్లంటూ వుండబట్టి యింటికి ఏదో పైములో రాకతప్పడంలేదు. సీత తప్పు కొనివుంటే యీ బెడద తప్పును. కాని సీతలో అంతాచచ్చిపోయినా పౌరుషం మటుకు చావలేదు. అందుకే చచ్చినా యిక యీ ముఖంతో, యీ కష్టాలతో, పుట్టినింట ముఖంచూపెట్టనని నిశ్చయించు కుంది. ఓపికవుంటే పాపతో కాలక్షేపం. పాప నిద్రపోతే కిటికీలో కూర్చుని యోగ నిద్రలో పడిపోయేతత్వం అలవాటు చేసు కుంది సీత.

పాపకోసంవండని తనిక, ఆకలికి ఆగ లేక పోతే వండుకోవాలి. యింటికి శేఖరం వస్తాడని, భోజనం సిద్ధంచేయా లనీ, యిలాంటి వన్నీ దాటిపోయాయి సీత చేతులనుంచి. ఏ రెండు గంటల రాత్రివేళో ఒళ్లు తెలియని పరిస్థితిలో యింటికి వచ్చిపడే శేఖరానికి అన్నం ఎందుకు? బంగారంలాంటి పెళ్ళాం ఎందుకు?

సీతని ఎంతగా ఆరాధించిన వాళ్ళ ముందునుంచి తానెత్తుకు తెచ్చుకున్నాడో మరిచిపోయాడు శేఖరం. సీత ఎంత అందంగా నవ్వగలదో మరిచిపోయాడు శేఖరం. సీత ఎంత అమాయికంగ తనని ప్రేమించిందో మరిచిపోయాడు శేఖరం. సీత యిప్పుడెలావుందో కూడ మరిచి పోయాడు శేఖరం.

కాని సీత? సీతంటే — ఏమిటి?

అందమైన కళ్ళు కావు.

ఒంపులు తిరిగిన బంగారపు శరీరం కాదు.

చిలిపితనం కాదు.

తాచుపాములాంటి జడకాదు.

అసలిదేమీ కానేకాదు సీత.

సీత ప్రాణంవుండే చలనం ఉడిగిన కీలుబొమ్మ. పాపకోసం పౌరుషం చంపుకొని బ్రతుకుతున్న ఆడది.

ఏనాటికైనా భర్త మారకపోతాడా అన్న ఆశతో పీడింపబడుతున్న ఆశావాది.

*ఇక యీ నాడు :*

వాన ఆగకుండా కురుస్తూంది. రాత్రి నలుమూలలా పరచుకొంది. ఎలక్ట్రిక్ దీపాలు కూడ ఆ వానరాత్రి గుడ్డిదీపాల లాగ మెరుస్తున్నాయి. కాని వెల్గునివ్వడం లేదు. చక్కని రాజకుమారుని కథ త్వరగా ముగించేసిందన్న కోపంతో నిద్రపోయింది పాప. కిటికీలో కూర్చుని వర్షాన్ని వర్షం చేస్తూన్న చప్పుణ్ణి చూస్తూ పరధ్యానంగా కూర్చుంది సీత. చుట్టూ వాతావరణంలో ఆవరించిన మంచులాంటి చల్లదనమే సీత హృదయంలోనూ ఆక్రమించుకుంది. ఎంతరాత్రి దాటిందో, ఎక్కడా శేఖరం జాడలేదు. ఇక రాకపోతేనో ? శేఖరం రాకపోతే ఏం చెయ్యాలి ? తను చచ్చిపోతుంది. అవును. చచ్చిపోతుంది.రాయిలాగామారిపోయిన తను బ్రతికినా చచ్చినా ఒకటే. ప్రపంచం అంతా చీకటి. తనకష్టాలభారం




"తమకేకదూ మొన్న లాటరీలో 50 వేలు వచ్చింది ? అందులో కొంతయినా ఇన్సూర్ చేయిస్తారని వచ్చా."

"అలాగా ! నలభయ్ వేలు బాకీల క్రింద పోయినయ్. మా ఆవిడ పోరుపడలేక 9 వేలతో కారు కొన్నా. ఇంకా ఏం ఇన్సూర్ చేసేది ?''

"అలాగా ! అయితే కారు ఇన్సూర్ చేయించండి.''

---

దిన దినం పెరుగుంది. తనని కృంగతీసేస్తుంది. బలహీనురాలైన స్త్రీ కెందుకింత భారాన్నిచ్చావు భగవాన్ !... దేవుడంతేలే. అలాగే చేస్తాడు. దేవుడూ మగవాడే. అందుకే యీ ప్రపంచాన్ని పురుషపరంగానే సృష్టించాడు. ఒక్క మగవాడు స్త్రీ సర్వస్వాన్నీ దోచుకుని హాయిగా నిశ్చింతగా తేలికైన హృద

యంతో నడిచి వెళ్ళిపోతాడు — యింకో స్త్రీ కోసం - కాని ఆడది? ఇవేమీ చేయ లేదు. తనిన్నాళ్ళూ శేఖరంకోసం బ్రతికింది. కుర్రవాణ్ణి సాకినట్లు సాకిందతన్ని. అతడే ఆమె ప్రేమికుడు; ప్రియుడు; భర్త. సర్వం అతనేగా నమ్మింది ; కష్టాలు సుఖాలుగా చూసుకుని తృప్తిపడింది. కాని ఫలితం?

వానహోరు విని విని విసిగిపోయిన సీత తనదృష్టిని యింటిలోపలికి వీధి గుమ్మంకేసి మరల్చింది. అక్కడ గుమ్మంలో తలుపుకి జేరబడి కూర్చుని వున్నాడు శేఖరం. వర్షపుజల్లుతో హాలంతాకూడా తడిసిపోయింది. పరధ్యానంలో తలుపు గడియవేయ లేదుసీత. తడిసిన బట్టలతో రేగిన క్రాపుతో ఎంతో అసహ్యంగా వున్నాడు శేఖరం. చదువు, దానికితగ్గ సంస్కారంవుండి కాలేజీలో ఓహో అనిపించుకున్న శేఖరమా! తన బావా! యితను అనుకుని క్షణం స్తంభించిపోయింది — సీత.

శేఖరం మాట్లాడలేదు కాని చూస్తూనే వున్నాడు. సీత లేచి నిలబడింది. "ఇదుగో మాట" అన్నాడు అతి కష్టంమీద. ఆశ్చర్యంతో మాటరాలేదు సీతకి. అసలీ మనిషి తనని పలకరించి ఎన్నాళ్ళయిందో మనస్సులో లెక్కవేసు కుంటూంది. దగ్గరగా పిలచి ఆప్యాయంగా కౌగిట చేర్చుకుంటాడేమో; తను అనుకున్నట్లు యీ మనిషి యీ క్షణంనుంచీ మారిపోయాడేమో!... శేఖరం దగ్గరకివెళ్ళి మోకాళ్ళమీద కూర్చుంది సీత. సీత కూర్చోడం, ఆమె చెంపమీద శేఖరం సాచికొట్టడం ఒక్క తృటిలో జరిగిపోయాయి. తన ఆశ్చర్యం నుంచి తేరుకొని నిలబడింది సీత. ఓ క్షణం క్రితం వెలిగిన ఆశాదీపం మరు క్షణంలోనే ఆరిపోగా లేచి వెళ్ళి పెద్దలైటు వేసింది సీత.

"ఎన్నోసార్లు చెప్పాను — అలా కిటికీలో కూర్చుని బయటికి చూడవద్దని. పాడుగుణాలెక్కడికి పోతాయి" అని తిట్టుకుంటూ నిలబడాలని చిన్నపిల్లలు చేసే సాము గరడీలు చేస్తున్నాడు శేఖరం. నాలుక మొద్దుబారి మాటలు తేలిపోతున్నాయి. కాళ్ళు నిలబడవు. నడవవు. కిటికీలో కూర్చుని సీత పంచభూతాలనీ ఆహ్వానిస్తుంది - సరసులనికాదు. ఈ అమాయకునికి అది తెలియచెప్పడం ఎవరి తరం? అందుకే ఆత్మక్షోభిస్తూంటే కొంగుపరచుకుని పాప పక్కనపడుకుంది; నిద్ర తెచ్చుకుందామని ప్రయత్నించింది.

మంచంమీద పడుకుంటూ "ఇదుగో మాట—ఇలా రమ్మంటూంటే—" అంటూ గోముగా పిలుస్తున్నాడు శేఖరం...ఏం మనిషి — అనుకుంది సీత. అవును. అతనికి కావలసినది అంతే — ఇంకా 'ఇదిగో మాట' అంటూనే వున్నాడు శేఖరం ... నిద్రాదేవి ఒడిలో వాలింది సీత. ★